

చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.4.500, సరాసరిన రూ.14.250 ధర పలికాయి.



కిలో టమాట రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
37.2°/12.1°

జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నిలకడగా చింతపండు ధర



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: చింతపండు ధర మార్కెట్‌లో నిలకడగా ఉంది. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం 1,217 క్వింటాళ్ల చింతపండు రాగా.. అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో కరిపులి రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సరాసరిన రూ.15 వేలు పలికింది. ఇక ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.11 వేలు, కనిష్టంగా రూ. 4 వేలు, సరాసరిన రూ.5 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

నేడు పెడపల్లిలో 'మహిళా భద్రతకు భరోసా'

పుట్టపర్తి అర్బన్: మహిళా భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం పుట్టపర్తి మండలం పెడపల్లిలో 'మహిళా భద్రతకు భవిష్యత్తుకు భరోసా' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలకు పెడపల్లి ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యే కార్యక్రమంలో మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

అలా వెళ్లి.. ఇలా వచ్చారు!

- చర్చనీయాంశమైన ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య వ్యవహారం
- నెల క్రితమే కమిషనరేట్‌కు అటాచ్
- మళ్లీ హిందూపురం సీఐగా పోస్టింగ్..



సీఐగా బాధ్యతలు తీసుకున్న లక్ష్మీ దుర్గయ్య

హిందూపురం అర్బన్: ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య హిందూపురాన్ని వదలడం లేదు. ఎక్కడికి బదిలీ చేసినా నెలల వ్యవధిలోనే మళ్లీ హిందూపురానికే పోస్టింగ్ తెచ్చుకుంటున్నారు. విధుల్లో నిర్లక్ష్యం... మహారాష్ట్ర, గోవా మద్యం రవాణా అవుతున్నా కట్టడి చేయలేకపోవడం, బెల్టు దుకాణాలు విచ్చల విడిగా ఏర్పాటు కావడంతో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు సీఐ లక్ష్మీ దుర్గయ్యపై నెల రోజుల క్రితమే బదిలీ వేటు వేశారు. విజయవాడ ఎక్సైజ్ కమిషనరేట్‌కు అటాచ్ చేశారు. కానీ నెల తిరక్కముందే ఆయన హిందూపురానికి పోస్టింగ్ తెచ్చుకున్నారు. సెలవురోజైనా ఆదివారమే బాధ్యతలు స్వీకరించారు. లక్ష్మీ దుర్గయ్య వ్యవహారం అటు ఎక్సైజ్ శాఖలోనూ, ఇటు ప్రజల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

అధికార పార్టీ ఆశీస్సులతోనే...

హిందూపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 9 మద్యం దుకాణాలున్నాయి. ఈ దుకాణాలను లాటరీ ద్వారా ఇతరులు దక్కించుకన్నా... ఆ తర్వాత వారి నుంచి అధికార పార్టీకి చెందిన నలుగురు నాయకులు తీసుకున్నారు. ఇప్పుడా దుకాణాలన్నీ ఆ నలుగురే నడిపిస్తున్నారు. ఆయా దుకాణాల పరిధిలో విచ్చల విడిగా బెల్టుషాపులు ఏర్పాటు చేయడంతో పాటు మద్యం దుకాణాల్లోనే ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తీసుకువచ్చిన మద్యాన్ని విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే 'ఎక్సైజ్ వ్యవహారాల్లో' ఆరితేరిన లక్ష్మీ దుర్గయ్య అయితేనే తమకు అనుకూలంగా ఉంటుందని భావించిన అధికార పార్టీకి చెందిన మద్యం సిండికేట్‌దారులు.. రాష్ట్రస్థాయిలో ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీంతో లక్ష్మీదుర్గయ్యకు మళ్లీ హిందూపురానికే పోస్టింగ్ వచ్చినట్లు తెలుస్తోంది.

- మడకశిర మండలం కల్లుమర్రి గ్రామానికి చెందిన నాగమ్మ కీళ్ల నొప్పులతో బాధపడుతూ.. హిందూపురం జిల్లా ఆస్పత్రిలో చేరింది. అక్కడ రాసి ఇచ్చిన మాత్రలను నెల రోజుల పాటు వాడింది. ఆ తర్వాత డాక్టర్‌ను సంప్రదించాల్సి ఉన్నా.. ఆ పని చేయకుండా నేరుగా మెడికల్ షాపునకు వెళ్లింది. గతంలో డాక్టర్ రాసిన చీటీ చూపి మాత్రలు తెచ్చుకుని ఏడాది పాటు వాడింది. ఫలితంగా మరిన్ని అనారోగ్య సమస్యల బారిన పడింది. తీరా పూర్తిగా ఆరోగ్యం క్షీణించిన తర్వాత డాక్టర్‌ను సంప్రదించగా.. రోజుల తరబడి మాత్రలు వేసుకోవడం వల్ల సమస్య తలెత్తినట్లు వెల్లడించారు.

- పెనుకొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన బాలకుమారికి తీవ్రమైన తలనొప్పి రాగా, పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకుంది. అక్కడ ఇచ్చిన మందులు రెండు వారాలు వాడిన తర్వాత డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. అయితే తలనొప్పి తగ్గాక.. మందుల వినియోగం మానేసింది. కానీ ఎప్పుడు తలనొప్పి వచ్చినా.. అవే మందులు తెచ్చుకుని మింగడం ప్రారంభించింది. ఆర్నెల్ల తర్వాత తలనొప్పి తీవ్రం కావడంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు డాక్టర్‌ను సంప్రదించగా.. అతిగా మందుల వినియోగం వల్ల ఆరోగ్యానికి చేటు జరిగినట్లు నిర్ధారించారు.

66	జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు
4	ఏరియా ఆస్పత్రులు
198	ప్రైవేట్ ఆస్పత్రులు
650	మెడికల్ షాపులు
రూ. 4 కోట్లుపైనే	రోజు మందుల వ్యాపారం
రూ. 5 కోట్లు	ప్రభుత్వాస్పత్రుల్లో రోజూ మందుల ఖర్చు



మాత్రలు మింగేస్తున్నారు!

- జిల్లాలో పెరిగిన మాత్రల వినియోగం
- భోజనానికి ముందే మాత్రలు మింగుతున్న జనం
- బీపీ, మధుమేహం, గుండె సంబంధిత రోగులే అధికం
- జోరుగా ఫార్మసీ వ్యాపారం... రూ.కోట్లలో ఆదాయం

సాక్షి, పుట్టపర్తి

జ్వరమొచ్చినట్లు అనిపిస్తే చాలు చాలా మంది పారాసిటమాల్ టాబ్లెట్ వేసుకుంటారు. దగ్గు, జలుబు ఇలా ఏది వచ్చినా టీవీ యాడ్‌లో చూపే టాబ్లెట్ లేదా గతంలో వైద్యుడు సూచించిన మందు బిళ్లలు తెచ్చుకుని ఎడాపెడా వాడేస్తుంటారు. కానీ ఇలా మాత్రలు ఇష్టానుసారం వాడటం వల్ల అసలుకే ఎసరు వస్తుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. వైద్యుడి సలహా లేకుండా మాత్రలు వేసుకోకూడదని సూచిస్తున్నారు. ఆరోగ్య నియమాలు పాటిస్తే జబ్బులన్నీ అదుపులోకి వస్తాయని చెబుతున్నారు. కానీ జనం మాత్రం అనవసర భయాలతో ముద్దకు ముందే మాత్ర మింగుతున్నారు. దీంతో జిల్లాలో మందుల వ్యాపారం.. మూడు మాత్రలు, ఆరు ఇంజక్షన్లుగా విరాజిల్లుతోంది.

కాఫీ, టీ బదులు మాత్రలు..



పొద్దున లేవగానే చాలా మంది టీ, కాఫీ, అల్పాహారం బదులు కొన్ని రకాల మాత్రలను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఫార్మసీ నిర్వాహకులు కూడా భోజనం తినక ముందు మింగే మాత్రలనే అధికంగా నిల్వ ఉంచుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు స్టాక్ తెప్పిస్తున్నారు. పరగడపున వేసుకునే మాత్రల వ్యాపారం రోజుకు జిల్లాలో సగటున రూ.2 కోట్లు పైగా ఉన్నట్లు అంచనా. ఇక మిగతా మాత్రలు కలుపుకుంటే ఈ మొత్తం రూ.4కోట్లపైమాటే.

రూ.4 కోట్లపైనే వ్యాపారం..

జీవనశైలిలో మార్పులు మనిషి జీవితాన్ని నాశనం చేస్తున్నాయి. ఆహార నియమాలు పాటించకపోవడం, చెడు అలవాట్లకు బానిస కావడంతో వ్యాధులు కబళిస్తున్నాయి. అలాగే ఆరోగ్య సూత్రాలపై అవగాహన లేని కారణంగా చాలా మంది విచ్చలవిడిగా మాత్రలు మింగేస్తున్నారు. తిండి కంటే ముందే మాత్రలు మింగేస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. అందువల్లే జిల్లా వ్యాప్తంగా మొత్తం 650 మెడికల్ దుకాణాలుండగా, రోజూ రూ.4కోట్లపైనే వ్యాపారం జరుగుతోంది.

చాప కింద నీరులా వ్యాధులు..

జబ్బులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. బీపీ, షుగర్, శ్వాసకోశ వ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులు పట్టి పీడిస్తున్నాయి. ఈ వ్యాధులు ఉన్న వారి సంఖ్య పెరగడంతో మందులు, మాత్రల వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోంది. జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో ప్రతి రోజూ సుమారు రూ.5 కోట్లు పైగా మందుల కోసమే ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. దీనికి తోడు ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా మందుల కొనుగోళ్ల వ్యాపారం రూ.కోట్లలో జరుగుతోంది. బీపీ, షుగర్, థైరాయిడ్, పేగు సమస్యలు, శ్వాస సంబంధిత వ్యాధులు, అల్సర్, గుండె సంబంధిత వ్యాధులకు పరగడపునే మాత్రలు తీసుకోవాల్సి ఉంటుందని ఫార్మసీ నిర్వాహకులు చెబుతున్నారు.

యాంటీ బయాటిక్‌కూ..

మరోవైపు కొందరు పరగడుపునే యాంటీ బయాటిక్ అధిక మోతాదులో మింగేస్తున్నారు. దీంతో బయాటిక్ మాత్రల అమ్మకాలు కూడా జిల్లాలో ఊపందుకున్నట్లు మెడికల్ దుకాణ నిర్వాహకులు చెబుతున్నారు.

మాత్రలతో ముప్పు

మందులు వైద్యుల సూచన మేరకే వాడాల్సి ఉంటుంది. ఏది పడితే అది మింగితే కొత్త రోగాల బారిన పడతారు. ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే దగ్గర్లోని వైద్యుడిని సంప్రదించాలి. ఇప్పుడు ప్రతి గ్రామంలోనూ వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. వారి సలహా మేరకు మాత్రలు వేసుకోవాలి. సొంతంగా మాత్రలు వాడటం, మెడికల్ దుకాణం వారి సలహా మేరకు మందులు వేసుకోవడం వల్ల అనర్థాలే ఎక్కువ. – డాక్టర్ ఫైరోజాబేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

ఢిల్లీలో భూకంపం.. నిమ్మలకుంటలో భయం

ధర్మవరం రూరల్: దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం తెల్లవారుజామున భూకంపం సంభవించడంతో నిమ్మలకుంట వాసులు ఆందోళన చెందారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత దళవాయి చలపతి కుటుంబ సభ్యులతో పాటు మరో పదిమంది తోలుబొమ్మల కళాకారులు మినిస్టరీ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో ఢిల్లీలో స్టాల్స్ నిర్వహిస్తున్నారు. వీరుంటున్న ప్రాంతంలో తెల్లవారుజామున భూకంపం సంభవించినట్లు ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న వారి బంధువులు, కుటుంబీకులు తీవ్ర ఆందోళన చెందారు. వెంటనే ఢిల్లీలో ఉంటున్న తమవారికి ఫోన్ చేసి బాగోగులను ఆరా తీశారు. అయితే తమకు ఎలాంటి ప్రమాదం జరగలేదని ఢిల్లీలో ఉంటున్న కళాకారులు తెలపడంతో బంధువులు, కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు.

తహసీల్దార్ వాహన డ్రైవర్‌పై 'తమ్ముళ్ల' దాడి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: బత్తలపల్లి మండల తహసీల్దార్ స్వర్ణలత కారు డ్రైవర్ బాషాపై సోమవారం తెలుగు తమ్ముళ్లు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోనే దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికంగా కలకలం రేపిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ టీడీపీ నాయకుడు పోలీసుల సహకారంతో ఇసుక అక్రమ రవాణాకు సిద్ధమయ్యాడు. అయితే ఇందుకు తహసీల్దార్ కారు డ్రైవర్ అడ్డు తగిలాడు. గట్టిగా ప్రశ్నిస్తే తహసీల్దార్ పేరు చెప్పి భయపెట్టాడు. దీంతో ఆగ్రహించిన టీడీపీ నాయకుడు... పోలీసుల నుంచి ఎలాంటి అభ్యంతరం లేకున్నా... మీ(తహసీల్దార్ కార్యాలయం) పెత్తనం ఏమిటని డ్రైవర్ బాషాపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయినా ఇసుక అక్రమ రవాణా గురించి డ్రైవర్ బాషా ఆరా తీయడంతో ఆగ్రహించిన టీడీపీ నాయకుడు సోమవారం దంపెట్ల పంచాయతీ కట్టకిందపల్లి, ఉప్పర్లపల్లి గ్రామాల నుంచి 10 మంది టీడీపీ నాయకులను వెంట తీసుకువచ్చి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోనే డ్రైవర్ బాషాపై దాడి చేశాడు. ఇసుక అక్రమ రవాణాను కప్పిపుచ్చేందుకు ఉప్పర్లపల్లిలో రస్తా సమస్యను సాకుగా చూపుతూ దాడి చేసినట్లు తెలుస్తోంది.

అక్రమ బ్రిడ్జి నిర్మాణంపై ఆగ్రహం



చిత్రావతిపై అక్రమ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

- 28లోపు చిత్రావతిపై నిర్మించిన వంతెన తొలగించాలి
- రియల్టర్‌కు నోటీసులు జారీ చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చిలమత్తూరు: చిత్రావతి నదిపై అక్రమంగా బ్రిడ్జి కట్టిన రియల్టర్‌పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చిత్రావతిని చెరబట్టారు' శీర్షికన సోమవారం 'సాక్షి' ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. ఉదయమే ఇరిగేషన్ ఏఈ, రెవెన్యూ అధికారులు అక్రమ బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన ప్రాంతాన్ని పరిశీలించారు. నదిపై అక్రమంగా నిర్మించిన బ్రిడ్జిని తొలగించాలని సదరు రియల్టర్‌కు నోటీసులు జారీ చేశారు. గతంలో ఇచ్చిన నోటీసులకు స్పందించని నేపథ్యంలో ఇదే ఆఖరు నోటీసు ఇచ్చినట్లు ఇరిగేషన్ డీఈ యోగానంద వెల్లడించారు. ఈ నెల 28వ తేదీ లోపు అక్రమ బ్రిడ్జి తొలగించకపోతే నేరుగా తామే రంగంలోకి దిగి తొలగిస్తామని హెచ్చరించారు. కాగా, అధికారులు చిత్రావతి బ్రిడ్జి వద్దకు రియల్టర్‌కు చెందిన భూముల గుండా వెళ్లేందుకు ప్రయత్నించగా..అతను గేట్లు తీయలేదు. దీంతో అధికారులు రెండు కిలోమీటర్ల మేర నడిచి అక్రమ వంతెన వద్దకు చేరుకోవాల్సి వచ్చింది.

సొంత అవసరాలకే...

నదికి ఇరువైపులా రియల్టర్ రెడ్డెప్పశెట్టికి చెందిన భూములున్నాయి. దీంతో అక్కడివరకూ వచ్చి వెళ్లేందుకు అతను బ్రిడ్జి నిర్మించుకున్నట్లు తెలుస్తోంది. అలాగే చిత్రావతి నదీ జలాలను తన భూములకు వినియోగించుకునేందుకు గుట్టుగా వంతెన నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. నాలుగేళ్లుగా చిత్రావతి ప్రవహిస్తుండగా సదరు రియల్టర్ తన భూములకు వాటిని వినియోగించుకునేందుకు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేశారని, కేవలం ఓవర్‌ఫ్లో అయినప్పుడు మాత్రమే నీరు దిగువకు వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని నోటీసులు ఇచ్చారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వినతులు.. వేడుకోళ్లు

- 'పరిష్కార వేదిక'కు భారీగా అర్జీలు
- వివిధ సమస్యలపై 420 వినతులు
- సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ చేతన్ ఆదేశం



ఈ చిత్రంలోని చిన్నారి పేరు పార్వతి. వయసు ఆరేళ్లు. తనకల్లు మండలం పాలెంవాండ్లపల్లి గ్రామం. పుట్టుకతో నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. తల్లిదండ్రులు కూలిపనులు చేసుకుని జీవిస్తున్నారు. కుటుంబ పోషణకే తీవ్ర ఇబ్బందులు పడుతున్న తాము కూతురు పార్వతికి చికిత్స చేయించేందుకు ఇబ్బంది పడుతున్నామని, ఆదుకోవాలని కదిరి ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ చేతన్‌ను వేడుకున్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్, చిత్రంలో జేసీ అభిషేక్ కుమార్, ఎమ్మెల్యే కందికుంట



ఇతని పేరు హనుమంతరెడ్డి. కదిరి మండలం చిప్పలమడుగు గ్రామం. ప్రభుత్వం యర్రదొడ్డి పొలం సర్వేనంబర్‌లు 362–18, 362–17లో ఐదెకరాల భూమి ఇచ్చింది. హనుమంతరెడ్డి పేరుమీద పట్టా, పాసుపుస్తకం కూడా మంజూరు చేసింది. కానీ సాగు చేసుకునేందుకు వెళితే.. కుటాగుళ్ల గ్రామానికి చెందిన నరసింహులు, గణేష్ అడ్డుతగులుతున్నారు. దీంతో హనుమంతరెడ్డి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ చేతన్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, పోలీసులు, అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కదిరి అర్బన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయం సోమవారం జనంతో కిక్కిరిసింది. వివిధ సమస్యలు ఎదుర్కొంటున్న జనం అర్జీలు సమర్పించేందుకు తరలిరాగా రెవెన్యూ డివిజన్‌స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కిటకిటలాడింది. సంక్షేమ పథకాలు అందివ్వాలని ఒకరు.. భూమి కబ్జా చేశారని ఇంకొకరు.. న్యాయం చేయాలని మరొకరు..ఇలా ఒక్కొక్కరు ఒక్కో సమస్యను ఏకరువు పెట్టారు. కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమానికి మొత్తంగా 420 అర్జీలు అందగా..వాటిని ఆయా శాఖలకు పంపారు. గ్రీవెన్స్‌కు రాలేని వారు మెయిల్ ద్వారా కూడా అర్జీలను పంపించవచ్చని కలెక్టర్ సూచించారు.

సంతృప్తికర పరిష్కారం చూపాలి..


అర్జీ దారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం ఆయన అధికారులతో సమీక్షించారు. రెవెన్యూకు సంబంధించిన సమస్యలపైనే ఎక్కువగా అర్జీలు అందుతున్నాయని, వాటి పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, పట్టు పరిశ్రమ శాఖ జేడీ పద్మావతి, ఏపీఎంఐపీ పీడ సుదర్శన్, డీపీఓ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ వెంకటరమణారెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ విజయశాంతిబాయి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్య, ఎల్‌డీఎం రమణకుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని ఇలా...

- దివ్యాంగుడైన తాను మానసికంగానూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నానని, పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని ఎన్‌పీకుంట మండలం దాసరివాండ్లపల్లికి చెందిన వేమనారాయణ కలెక్టర్‌కు కలెక్టర్‌కు విన్నవించారు.
- తమ కులస్తుల కోసం పాలిటెక్నిక్ కళాశాల పక్కనే కేటాయించిన స్థలంలో బంజారా కమ్యూనిటీ భవనం నిర్మించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాంప్రసాద్‌నాయక్ కలెక్టర్ చేతన్‌ను కోరారు.
- మరాఠాల శ్మశానవాటిక కోసం కేటాయించిన స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని పట్టణానికి చెందిన మరాఠా కులస్తులు కలెక్టర్ చేతన్‌ను కోరారు.
- పెండింగ్‌లో ఉన్న 6 నెలల జీతాలు చెల్లించి, టాస్క్‌లు ఇవ్వాలని కదిరి మండలానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లు మారెప్ప, భాస్కర్, రవినాయక్ తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.



లింగార్చన ఘట్టం నిర్వహిస్తున్న వేదపండితులు



1116 లింగాలతో సత్యసాయి రూపం



అతిరుద్ర మహాయజ్ఞం నిర్వహిస్తున్న రుత్వికులు

సర్వం.. సాయీశ్వరం

- సత్యసాయి నామస్మరణతో ప్రతిధ్వనించిన ప్రశాంతి నిలయం

ప్రశాంతి నిలయం: సత్యసాయి సన్నిధి ప్రశాంతి నిలయం సాయీశ్వర నామంతో ప్రతిధ్వనించింది. వేదపండితుల మంత్రోచ్చారణలు..అశేష భక్తకోటి సంకీర్తనల నడుమ సోమవారం అష్టోత్తర శత సహస్ర సాయీశ్వర లింగార్చన పర్వం కమనీయంగా సాగింది. ప్రశాంతి నిలయంలో అతిరుద్ర మహాయజ్ఞం నాలుగో రోజు సోమవారమూ కొనసాగింది. నార్త్ బిల్డింగ్స్ వెనుక భాగాన ఉన్న మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసి వేదిక వద్ద అష్టోత్తర శత సహస్ర సాయీశ్వర లింగార్చన ఘట్టాన్ని నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అతిరుద్ర మహాయజ్ఞం ఆవశ్యకత, సత్యసాయి శత జయంతి వేడుకల లక్ష్యాన్ని వివరించారు. అనంతరం రుత్వికులు మహాగణపతి పూజ, మహాసంకల్పం, కలశ స్థాపన, మహాన్యాస పారాయణం, లింగస్థాపన ఘట్టాలను నిర్వహించారు. సాయంత్రం ప్రముఖ ఫ్లూట్ వాయిద్యకారుడు కలైమ్మమణి బాలసాయి, మండోలిన్ వాయిద్యకారుడు గాంధర్వకళారత్న రాజుల బృందం సంగీత కచేరీ నిర్వహించి భక్తులను అలరించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

పచ్చదనం పెంపొందిద్దాం



పక్షులను గుర్తిస్తున్న డీఎఫ్ఓ చక్రపాణి

ఎన్‌పీకుంట: అడవుల్లో అగ్నిప్రమాదాలు నివారించి, పచ్చదనం పెంపొందించేందుకు అటవీశాఖ, ఎఫ్ఈఎస్ సంస్థ కలిసి ప్రణాళికలు రూపొందించుకొని పనిచేద్దామని జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి పిలుపునిచ్చారు. పెడబల్లి జలాశయ పరిసర ప్రాంతాలతో పాటు ఎగువతూపల్లి, పాపన్నగారిపల్లి, సారగుండ్లపల్లి, నాగంవారిపల్లిలో సోమవారం ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ (ఎఫ్ఈఎస్), అటవీశాఖ ఆధ్వర్యంలో గ్రేట్ బ్యాక్‌యార్డ్ బర్డ్ కౌంట్ కార్యక్రమం నిర్వహించారు. డీఎఫ్ఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అటవీశాఖ అధికారులు, ఎఫ్ఈఎస్ సభ్యులు ఐదు బృందాలుగా ఏర్పడి రిజర్వ్‌ఫారెస్ట్, ఉమ్మడివనరులు, చెరువులు, చిత్తడి నేలలు, వ్యవసాయ భూములలో 45 రకాల పక్షి జాతులను గుర్తించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వివిధ రకాల పక్షులు, జంతుజాతులు, వృక్షజాతులు ఒకదానికి ఒకటి పరస్పరం ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయని, వాటి ఆవాసాలను కాపాడాల్సిన బాధ్యత మనదేనని అన్నారు. విచక్షణరహితంగా క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువులు వాడటం, కొండలు, అడవులకు నిప్పుపెట్టడం వల్ల పక్షులు అంతరించిపోతున్నాయన్నారు. పక్షులతో పర్యావరణ సమతుల్యత సాధ్యమని, వాటిని పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఈఎస్ రాష్ట్ర ప్రతినిధి భక్తర్‌వలి, అటవీశాఖ అధికారులు, ఎఫ్ఈఎస్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా కూలీ దుర్మరణం



ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన కొల్లమ్మ

మడకశిర: ట్రాక్టర్ ప్రమాదంలో మహిళా కూలీ దుర్మరణం చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండంపల్లి దొమ్మరహట్టికి చెందిన కొల్లమ్మ (45) ట్రాక్టర్ కూలీగా వెళ్తూ జీవనం సాగిస్తోంది. సోమవారం కూలి పనికి వచ్చింది. ట్రాక్టర్ పరిగి నుంచి ఇసుకను లోడ్ చేసుకుని మడకశిరకు వస్తుండగా వ్యవసాయ మార్కెట్ వద్దకు రాగానే ఇంజిన్ – ట్రాలీకి మధ్యన గల ఇనుపరాడ్ విరిగి పోయింది. ట్రాక్టర్ ట్రాలీలో ఇసుకపై కూర్చున్న కొల్లమ్మ జారి కిందకు పడిపోయింది. క్షణాల్లో ట్రాలీ చక్రం తలపై వెళ్లడంతో కొల్లమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈమెకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆడుకుంటూ రైలెక్కేశాడు!

- హిందూపురం స్టేషన్‌లో దిగిన యలహంక బాలుడు



బాలున్ని తల్లికి అప్పగిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: కర్ణాటక రాష్ట్రం యలహంక రైల్వే స్టేషన్ సమీపంలో సరిత అనే మహిళ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. స్టేషన్ వద్ద ఆడుకుంటున్న ఆమె ఎనిమిదేళ్ల కుమారుడు ముఖేష్‌సింగ్ రైలు ఎక్కాడు. అది కాసేపటికే కదిలింది. అలా హిందూపురం రైల్వే స్టేషన్‌లో ఆ బాలుడు బోగీ నుంచి కిందకు దిగాడు. అక్కడ అటు ఇటు తిరుగుతూ ఉన్న బాలుడిని పోలీసులు గమనించారు. వివరాలు ఆరా తీయగా.. యలహంక తమ ఊరు అని చెప్పాడు. దీంతో పోలీసులు యలహంక రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడ ఆటో డ్రైవర్ బాలుడి ఫొటోను గుర్తుపట్టి తల్లికి విషయం చెప్పాడు. ఆమె హుటాహుటిన హిందూపురం వచ్చింది. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉంచుకున్న బాలుడిని సీఐ జనార్దన్ తల్లి సరితకు అప్పగించాడు. ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

శతాధిక వృద్ధుడు కన్నుమూత

రాయదుర్గంటౌన్: పట్టణానికి చెందిన మున్సిపల్ విశ్రాంత ఉద్యోగి ఎస్.అమీరుద్దీన్‌సాబ్ (104) అనారోగ్యంతో సోమవారం ఉదయం 6.30 గంటలకు చనిపోయారు. ఈయన భార్య 40 ఏళ్ల క్రితమే మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సాయంత్రం బళ్లారి రోడ్డులోని ఖబర్‌స్థాన్‌లో అంత్యక్రియలు నిర్వహించినట్లు కుమారుడు మెహబూబ్‌బాషా తెలిపారు.

బండయ్య.. ది గ్రేట్

- 103 ఏళ్లలోనూ చలాకీగా.. • వ్యవసాయం, జ్యోతిష్యంలోనూ అపార అనుభవం • ఆదర్శం.. విశ్రాంత ఉపాధ్యాయుడి జీవన ప్రస్థానం



కళ్యాణదుర్గం సబ్ ట్రెజరీ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగులతో బండయ్య..



బండయ్య మాస్టార్‌ను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

కళ్యాణదుర్గం: ఆయనో విశ్రాంత ఉపాధ్యాయుడు. పెన్షన్ కోసం ఏటా సమర్పించే లైఫ్ సర్టిఫికెట్ తీసుకుని కళ్యాణదుర్గం సబ్ ట్రెజరీ కార్యాలయానికి వచ్చారు. ఎంతో చలాకీగా కనిపించిన ఆయన్ను చూసి తోటి రిటైర్డు ఉద్యోగులు మల్లికార్జున, తిప్పేస్వామి, హంపన్న, అంజినప్ప, మారెన్న, విశ్వనాథ్, భగవాన్ దాస్ తదితరులు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఆ మాస్టారు పేరు బండయ్య. 103 ఏళ్ల వయసులోనూ ఆరోగ్యకరంగా ఉన్న ఆయన్ను పెన్షనర్ భవనంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండయ్య విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘానికి తన వంతుగా రూ.5 వేల విరాళం అందజేశారు.

ఉద్యోగ ప్రస్థానం...

బ్రహ్మసముద్రం మండలం పొబ్బర్లపల్లికి చెందిన బండయ్య మాస్టారు 1922 జూలై 10న జన్మించారు. నాలుగో తరగతి వరకు చదివి జ్యోతిష్యం నేర్చుకున్నారు. అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటన చూసి ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. తొలి నెల జీతం రూ.30.10 పైసలు. 1978లో ఉద్యోగ విరమణ పొందే నాటికి జీతం రూ.90. ప్రస్తుతం ప్రతి నెలా రూ.26 వేల పెన్షన్ అందుకుంటున్నారు.

ఆదర్శ రైతుగా రాణింపు..

బండయ్య మాస్టారు ఉద్యోగ విరమణ అనంతరం స్వగ్రామం పొబ్బర్లపల్లిలో వ్యవసాయంపై దృష్టి సారించారు. సేంద్రియ వ్యవసాయం, పంట మార్పిడితో ఆదర్శ రైతుగా రాణించారు. కొత్త రకం వంగడాలు పరిచయం చేస్తూ గ్రామంలోని రైతులకు సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు సాగారు. శ్రీశైలంలో సదాశివయ్య అన్న సత్రం చైర్మన్‌గా పనిచేశారు. పలుచోట్ల విరాళాలు సేకరించి నిత్యాన్నదాన సత్రాన్ని విజయవంతంగా నడిపారు.

సాత్వికాహారమే ఆరోగ్య రహస్యం..



బండయ్య మాస్టారు ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. ప్రస్తుతం రెండు పూటల స్నానం చేస్తూ.. సాత్విక ఆహారం, మజ్జిగ, పాలు స్వీకరిస్తున్నారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘ కాలిక వ్యాధులకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల వయసు రీత్యా కంటి చూపు మందగించింది. ఈయన భార్య శివలింగమ్మ నాలుగేళ్ల క్రితం మరణించింది. ఇక ఏడుగురు సంతానంలో ఒకరు మృతి చెందారు. మిగిలిన ఆరుగురు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో స్థిరపడ్డారు. ప్రస్తుతం కర్ణాటకలోని శ్రీరంగపట్నంలో కుమారుడు గౌరీ శంకర్‌తో కలిసి మాస్టారు ఉంటున్నారు.

జవాన్‌కు కన్నీటి వీడ్కోలు



జవాన్ లక్ష్మన్న భౌతికకాయాన్ని వాహనంలో ఉంచి అంతిమ యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



గౌరవ వందనం సమర్పిస్తున్న ఆర్మీ అధికారులు

బ్రహ్మసముద్రం : బీఎస్‌ఎఫ్ జవాన్ వడ్డే లక్ష్మన్నకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆర్మీ సిబ్బంది కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు. ఢిల్లీ సమీపంలో నాలుగు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో మరణించిన వడ్డే లక్ష్మన్న (33) భౌతికకాయం ఆదివారం అర్ధరాత్రి స్వగ్రామం బ్రహ్మసముద్రానికి అధికారులు తీసుకువచ్చారు. కుమారుడిని చూసి తల్లిదండ్రులు సుశీలమ్మ, రామచంద్రప్ప గుండెలవిసేలా రోదించారు. బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. సోమవారం ఉదయం జవాన్ భౌతికాయాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి అంతిమయాత్ర నిర్వహించారు. వందలాది మంది అభిమానుల మధ్య 'వీరుడా... నీకు వందనం.. అమరుడా లక్ష్మన్నా నీకు వందనం' అంటూ ఆర్మీ అధికారులు నినదించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి జైజవాన్ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం పశువైద్యశాల సమీపాన శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. బీఎస్‌ఎఫ్ ఎస్‌ఐ మాధవ్‌రావ్, హెడ్‌కానిస్టేబుల్ మాంతేష్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర భద్రత బలగాలు కవాతు నిర్వహించారు. జవాన్ భౌతికకాయంపై ఉన్న జాతీయ జెండాను వారి కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం కుటుంబ సభ్యుల కడసారి వీడ్కోలు అనంతరం ఆర్మీ అధికారులు గౌరవ వందనం సమర్పించి మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. కార్యక్రమంలో సీఐ నీలకంఠేశ్వర్, తహశీల్దార్ సుమతి, ఎస్ ఐ నారేంద్రకుమార్, ఆర్ ఐ నాగిరెడ్డి, ఎంపీడీఓ నందకిశోర్, ఎంఈఓ ఓబుళపతి, క్రిష్టానాయక్, ఎంపీపీ చంద్రశేకర్ రెడ్డి జెడ్పీటీసీ ప్రభావతి రాజకీయ పార్టీల నాయకులు పలువురు పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారం

లేపాక్షి: మండలంలోని గౌరిగానపల్లిలో మహిళపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారం చేశారు. ఎస్‌ఐ నరేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో 26 ఏళ్ల మహిళ, అక్కడే ఉండే అశోక్, వెంకటేష్ కలిసి ఆదివారం రాత్రి మద్యం తాగారు. అనంతరం మద్యం మత్తులో ఉన్న అశోక్, వెంకటేష్ ఆమెపై అత్యాచారం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా.. రిమాండ్‌కు మెజిస్ట్రేట్ ఆదేశించారు.

వివాహితపై అత్యాచారయత్నం

తాడిపత్రి రూరల్: బొడాయిపల్లి సమీపంలో ఆదివారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లిన ఓ వివాహితపై బంధువైన అంకన్న అత్యాచారయత్నం చేశాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో అతడు అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం బాధితురాలు జరిగిన విషయం ఇంట్లో తెలిపింది. సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అంకన్నపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కాటమయ్య తెలిపారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో పరిష్కరించాలని డీఆర్‌ఓ విజయ సారథి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ద్వారా ప్రజల నుంచి డీఆర్‌ఓ 123 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు.

విద్యుత్ తీగలు తగిలి 15 గొర్రెలు మృతి

శెట్టూరు: విద్యుత్ తీగలు తెగి మందపై పడటంతో అందులో 15 గొర్రెలు మృతి చెందిన సంఘటన మల్లేటిపురంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కురుబ గోవిందప్ప సుమారు 100 గొర్రెలతో తన పొలంలోనే మంద ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం రాత్రి మంద వద్దే నిద్రించాడు. గొర్రెల మంద నిద్రిస్తున్న స్థలం వద్దే విద్యుత్ మెయిన్‌లైన్ ఉంది. సోమవారం ఉదయం తెల్లవారుజామున మూడుగంట సమయంలో విద్యుత్‌తీగ తెగి గొర్రెల మందపై పడింది. మెరుపుతో కూడిన శబ్దం రావడంతో రైతు ఉలిక్కిపడి లేచాడు. రైతు వెంటనే లైన్‌మెన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. విద్యుత్‌షాక్‌కు గురికాంకుండా జాగ్రతపడి గొర్రెలను మందనుంచి బయటకి తీశాడు. అయితే అప్పటికే 15 గొర్రెలు మృతి చెందాయి.

యూట్యూబ్ చానల్ నిర్వాహకుడి అదృశ్యం

- ద్విచక్రవాహనంపై బండరాళ్లతో దాడి



తిరుమలరెడ్డి (ఫైల్)



ఘటనా స్థలంలో పడి ఉన్న బైక్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

గుంతకల్లు రూరల్: ఇంటి నుంచి పొలానికి ద్విచక్రవాహనంపై బయల్దేరిన యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు బి.తిరుమలరెడ్డి (45) బుగ్గ సంగాల వద్ద అదృశ్యమయ్యాడు. సంఘటన స్థలంలోనే మొబైల్, చెప్పులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బైక్‌పై బండరాళ్లతో దాడిచేసిన ఆనవాళ్లు ఉన్నాయి. ఎవరో పథకం ప్రకారం దాడిచేసి.. కిడ్నాప్ చేశారా.. లేక హత్య చేసి కాలువలో ఏమైనా పడేశారా అన్నది తెలియడం లేదు. దీంతో పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా మద్దికెరకు చెందిన బి.వెంకటరెడ్డి కుమారుడైన బి.తిరుమలరెడ్డి కొన్నేళ్లుగా గుంతకల్లుకు వచ్చి నివాసముంటున్నాడు. బుగ్గ సంగమేశ్వర ఆలయ సమీపంలో తన తండ్రి నుంచి సంక్రమించిన భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. తండ్రి పేరున బీవీఆర్ అనే యూట్యూబ్ చానల్ కూడా నిర్వహిస్తున్నాడు. ఈయనకు భార్య కామేశ్వరి, అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్న కూతురు మోనా ఉన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న బావమరిదిని చూసేందుకు రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లిన తిరుమలరెడ్డి ఆదివారం సాయంత్రం తిరిగి గుంతకల్లుకు చేరుకున్నాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి పొలానికి పల్సర్ బైక్‌పై బయల్దేరాడు. అయితే మరో ఐదు నిమిషాల్లో పొలానికి చేరుకుంటాడనగా అదృశ్యం అయ్యాడు. బుగ్గ సంగాల వద్ద బండరాళ్లతో బైక్‌ను ధ్వంసం చేసి ఉంది. సమీపంలోనే చెప్పులు, మొబైల్ చెల్లాచెదురుగా పడ్డాయి. అటుగా వెళ్లిన రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అటు మద్దికెర, ఇటు గుంతకల్లు నుంచి భారీ సంఖ్యలో ప్రజలు సంఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డీఎస్పీ శ్రీనివాస్, గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ టీపీ వెంకటస్వామి సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసు జాగిలాన్ని రప్పించగా.. సంఘటన స్థలం నుంచి గుట్ట వరకూ వెళ్లి అటు నుంచి పక్కనే ఉన్న హంద్రీ-నీవా కాలువ వద్ద ఆగిపోయింది. తిరుమలరెడ్డిని చంపి కాలువలో పడేశారా లేక, కిడ్నాప్ చేసి తీసుకెళ్లారా.. దుండగుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఏమైనా కాలువలో పడిపోయాడా.. ఇంకేమైనా జరిగిందా.. తిరుమలరెడ్డికి ప్రత్యర్థులు ఎవరు ఉన్నారు.. అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురికి రిమాండ్

సోమందేపల్లి : కావేటి నాగేపల్లి సమీపంలోని నాసన్ పరిశ్రమ వద్ద గతంలో ఆందోళన నిర్వహించిన వారిలో ఏడుగురికి మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌ఐ రమేష్‌బాబు మీడియాకు వెల్లడించారు. 2020–21లో జరిగిన ఆందోళనలపై నాసన్ పరిశ్రమ నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. నిందితులు సకాలంలో కోర్టుకు హాజరు కాలేదు. దీంతో అరెస్టు వారెంటు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఏడుగురు నిందితులను పెనుకొండ కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి సయ్యద్ ముజీబ్ ఫసల్ 15 రోజుల రిమాండ్ విధించారు.

బిగుస్తున్న ఉచ్చు!

- 'కమర్షియల్ ట్యాక్స్' అవినీతిపై మరోసారి విచారణ
- అవినీతి అధికారుల గుండెల్లో పరుగెడుతున్న రైళ్లు



కార్యాలయంలో విచారిస్తున్న కమర్షియల్ ట్యాక్స్ రీజనల్ ఆడిట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ నాగేంద్ర

హిందూపురం అర్బన్: అనధికార తనిఖీలు.. అక్రమ వసూళ్లతో చర్చనీయాంశమైన హిందూపురం కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు ఉచ్చు బిగుస్తోంది. జీరో బిజినెస్‌ను ప్రోత్సహించడం ఇందుకోసం భారీగా మామూళ్లు తీసుకుంటున్న వైనంపై పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 12న కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటి కమిషనర్ మురళీమనోహర్ హిందూపురం వచ్చి ఫిర్యాదుదారులతో పాటు సీటీఓ కృష్ణవేణి, డీసీటీఓలు, ఏసీటీఓలతో సమావేశమై ఆరోపణలపై విచారణ చేపట్టారు. అయితే ఆ నివేదిక సక్రమంగా లేదంటూ సోమవారం కమర్షియల్ ట్యాక్స్ రీజినల్ ఆడిట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ నాగేంద్ర, జాయింట్ కమిషనర్ శేషాద్రితో పాటు డిప్యూటీ కమిషనర్ మురళీ మనోహర్ హిందూపురం చేరుకుని మరోమారు ఫిర్యాదుదారులను రహస్యంగా విచారించారు. అనంతరం కార్యాలయానికి చేరుకొని అధికారులతో సమావేశమై పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. హిందూపురం సర్కిల్ పరిధిలో సిబ్బందిపై వచ్చిన ఆరోపణలతో పలువురు డీలర్లు, వ్యాపారులను కలిసి ప్రాథమికంగా విచారించామన్నారు. నివేదికను మంగళవారం కమిషనర్‌కు నివేదిస్తామన్నారు. కాగా 'కియా' పరిశ్రమ నుంచి నేరుగా ఆదాయం రావడం లేదని అధికారులు తెలిపారు. కియా అనుబంధ పరిశ్రమలు ఏడాదికి రూ.60 వేల కోట్ల వరకు లావాదేవీలు చేస్తుండగా.. వాటి ద్వారానే ఆదాయం సమకూరుతోందన్నారు. తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామిక వాడ నుంచి టాక్స్ వసూలు అవుతోందన్నారు. గతంలో అక్కడి పరిశ్రమల వారు రికార్డులు సరిగా నిర్వహించక పోవడంతో రూ. 100 కోట్లకు పైగా జరిమానా విధించామన్నారు.

చట్ట పరిధిలో న్యాయం చేస్తాం

- బాధితులకు ఎస్పీ రత్న భరోసా



పోలీస్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ

పుట్టపర్తి టౌన్: అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు చట్టపరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ రత్న భరోసా ఇచ్చారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 75 మంది తమ సమస్యలపై ఎస్పీకి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ, పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్పీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమించి.. మాపైనే రివర్స్ కేసులు

చిలమత్తూరు మండలం మురుసవాండ్లపల్లి పొలం 244–2 సర్వేనంబర్‌లో 64 సెంట్ల భూమికి సంబంధించి తమ వద్ద అన్ని పత్రాలూ ఉన్నాయని, అయినా అధికార పార్టీకి చెందిన శ్రీనివాసులు, వెంకటేషులు తమ స్థలాన్ని ఆక్రమించి ఇల్లు కట్టుకుంటున్నారని అశ్వత్థరెడ్డి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తే తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. తమపైనే ఆక్రమణదారులు రివర్స్ కేసు పెట్టారని తెలిపాడు. చంపుతామని బెదిరిస్తున్నారని, తమకు రక్షణ కల్పించి.. న్యాయం చేయాలని కోరాడు. ఎస్పీ స్పందిస్తూ చిలమత్తూరు పోలీసులకు ఫోన్ చేసి విచారణ చేసి న్యాయం చేయాలని ఆదేశించారు.

అడవికి నిప్పు పెడితే చర్యలు

అడవికి నిప్పు పెడితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్పీ రత్న హెచ్చరించారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా పలుచోట్లు ఆకతాయిలు, గొర్రెల కాపరులు కొండలకు, అడవులకు నిప్పు పెట్టడం బాధాకరమని పేర్కొన్నారు. నిప్పు పెట్టడం వల్ల దట్టమైన అడవులు అంతరించిపోతున్నాయని తెలిపారు. వందలాది వన్య ప్రాణులు అగ్నికి ఆహుతైపోతున్నాయన్నారు. ఫలితంగా పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యాన రైతులు, పశుపోషకులు కూడా తీవ్రంగా నష్టపోతారన్నారు. అడవులను, పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

'ఉపాధి' పనుల్లో భారీగా అక్రమాలు



'స్థానిక' ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

- కూలీలకు కాకుండా కాంట్రాక్టర్లతో పనులు ఎలా చేయిస్తారు?

రాయదుర్గం: కూటమి అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పనుల్లో భారీగా అవకతవకలు, అక్రమాలు జరిగాయని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ఆరోపించారు. ఈ పథకం కూలీలకు కాకుండా కూటమిలోని కొందరు కాంట్రాక్టర్లకు వరంగా మారిందన్నారు. సోమవారం రాయదుర్గంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరైన ఆయన జిల్లాలోని పలు మండలాల ఎంపీపీలు, సర్పంచులతో కలసి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో రవీంద్రారెడ్డి మాట్లాడారు. అధికార పార్టీ చెప్పిన వారికి ఉపాధి పనులను ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. కూలీలతో కాకుండా ఉపాధి పనులను కాంట్రాక్టర్లకు ఎలా కేటాయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్‌కళ్యాణ్ ఉండి ఏం సాధించారని ప్రశ్నించారు. ఉపాధి పనులు జరిగిన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాల్సిన నేమ్‌బోర్డుల బిల్లుల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. నేమ్‌బోర్డుల నిధులు తమ బంధువుల వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకున్న వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం మండల కన్వీనర్ రామాంజినేయులు, నాయకుడు శివారెడ్డి పాల్గొన్నారు.

కుమార్తెను చంపి.. తల్లి ఆత్మహత్య





మృతులు శృతి, రోషిణి (ఫైల్)

పావగడ: కుమార్తెను చంపి... ఆపై తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం బాగలకుంటె పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పావగడ తాలూకా బ్యాడనూరు గ్రామపంచాయతీ అధ్యక్షురాలు శృతి (30), ఆడిటర్ గోపాలకృష్ణ దంపతులు. వీరికి నాలుగు సంవత్సరాల కుమార్తె రోషిణి ఉంది. ఆదివారం రాత్రి బాగలకుంటె పోలీస్ స్టేషన్ పరిధిలోని అద్దె ఇంటిలో శృతి నిద్రపోతున్న తన కుమార్తెను చంపి.. తర్వాత ఉరివేసుకుని తాను ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించగా డెత్ నోట్ దొరికింది. అందులో తన చావుకు భర్త గోపాలకృష్ణ, ఓ రాజకీయ నాయకురాలు కారణమని పేర్కొంది. గోపాలకృష్ణ వివాహేతర సంబంధం కారణంగానే తన కూతురు శృతి బలవన్మరణానికి పాల్పడిందని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు గోపాలకృష్ణను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. తల్లీ కూతుళ్ల మృతదేహాలను శిర తాలూకా గుళికేనహళ్ళికి చెందిన పుట్టింటి వారికి అప్పగించారు.

ఆత్మహత్యాయత్నాన్ని నిలువరించిన పోలీసులు



రామాంజనేయులుతో మాట్లాడుతున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: ఆత్మహత్యాయత్నం చేసుకునేందుకు సిద్ధమైన వ్యక్తిని పోలీసులు సకాలంలో నిలువరించి ప్రాణాలు కాపాడారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెన్నేకొత్తపల్లికి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి సోమవారం కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది రైలుకిందపడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. సమీపంలోని రైల్వే ట్రాక్‌పైకి వెళ్లాడు. అతని మిత్రుడి ద్వారా పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ సత్యనారాయణ వెంటనే హరి, నరసింహ అనే ఇద్దరు పోలీసులను సంఘటన స్థలానికి పంపించారు. అక్కడ ఆ వ్యక్తిని వారు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారు. కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.